# వంటమనిషి

## పైడిపాటి సుబ్బరామశాస్త్రి

త్రోసిపుచ్చారు. ఆమెకే యీ గతి పట్టిందని తెలిసిన తర్వాత అచ్యుతం ఆమె వంక చూడలేక పోతున్నాడు.

భార్య పుట్టింటికి వెళ్ళిన సందర్భంలో, వంటమనిషి టిఫిన్, కాఫీ తెచ్చి యిచ్చింది "మీకు వివాహం కాకముందు ఏవయినా సంబంధాలు చూశారా?లేక-" అని ఆగాడు అచ్యుతం.

"ఏవో చాలా చూశారండీ'ఎప్పటిమాట! పాతికేళ్ళవుతుందేమో! నాకేమి జ్ఞాపకం! కాని ఒక సందర్భం మాత్రం జ్ఞాపకం ఉంది. ఒక సంబంధం నిశ్చయమయినట్లే అయి తృళ్ళి పోయింది." అన్నది వంటమనిషి

"అదేల్లా! వారు అనుకున్నదానికంటె కట్నం ఎక్కువ కావాలని కోరారా?"

"అబ్బే! అదేం లేదు బాబుగారూ! ఆ పిల్లవాడు నన్ను వచ్చి చూసుకోనుకూడా లేదు. తల్లి దండ్రుల యిష్టం అన్నాడట! వారే వచ్చి నిశ్చయ తాంబూలాలు తీసుకున్నారు."

"అందాకా వచ్చింది?"

"వచ్చింది బాబూ! వచ్చింది. కాని, లిఖితం ఉండవద్దూ? లేదు కనుకనే తృళ్ళి పోయింది. నాకు చిన్నతనం! వారెవరో కూడా గుర్తు లేదు. నా నుదుటను వైధవ్యం ఉన్నది కనుకనే,ఆ పిల్లవాడికి సంబంధం తప్పిపోయింది. అదృష్టవంతుడు.






## వంట మనిషి

ఎక్కడో మహాలక్ష్మివంటి పిల్లను చేసుకొని సుఖంగా ఉండి ఉంటాడు."

"అల్లా ఎల్లా జరిగింది?"

"కర్మ! బాబూ! కర్మ! నా శ్రేయస్సుకోరి, మా వాళ్ళు, అంతకంటె చాలా మంచి సంబంధమని ఆ మహాపాపాని కొడిగట్టారు. నాకు మేలు చేయబోయి కీడు చేశారు. మా వాళ్ళు పిల్ల నివ్వమని మాట తప్పితే, ఆ పిల్లవాడి తండ్రి ఉసూరుమని కంట తడిపెట్టి వెళ్ళిపోవడం మాత్రం నా కిప్పటికీ గుర్తు ఉంది. అదే, నాకు శాపం! క్రొత్త సంబంధం అస్థి పోవడం, వైధవ్యం రావడం! ఇంతకంటె ఏమి కావాలి?" అంది వంట మనిషి.

"పెళ్ళి కాకముందు వ్యవహారం కదా!" అని, అని చూశాడు అచ్యుతం.

వంటమనిషి అతని వంక తీక్షణంగా చూచింది. అల్లా ఎప్పుడూ చూడగా అచ్యుతం చూడలేదు. "బాబుగారూ! అన్నీ తెలిసిన మీరు కూడా అల్లా మాట్లాడుతున్నారా? పెళ్ళి అనే సంస్కారమంటూ కాలేదు కాని, నిశ్చయతాంబూలం తీసుకుంటే పెళ్ళి అయినట్లే లెక్క. వాగ్దానం కూడా ఒక దానమేకదా! అది కన్యాదానం నిమిత్తం అయిన వాగ్దానం. దాని విలువ గొప్పది. పిల్లనిస్తామని ఆశ కల్పించి, అసత్యమాడడం దోషం కదా! అంతకంటె వేఱొక నరకం ఉన్నదా? మన పల్లెల్లో, "మాటా? మారు మనువా?" అనే సామెత ఉంది. మారు మనువు ఎంత దోషమో, మాట తప్పడం కూడా అంత దోషమనే దాని అర్థం. ఇంకొక విషయంగా ఆలోచిస్తే, కన్య నిస్తామని మాట తప్పి మఱొకరికిస్తే మారు మనువు చేసినట్లే! అందుచేతనే మా పుట్టింటివారు పురుగునాకి పోయారు. నాకీ గతి పట్టింది!" అని వలవలా ఏడ్చింది. ఆమె వివేకానికి, ధర్మ నిష్ఠకూ, అచ్యుతం, ఆశ్చర్యపోయాడు. ఆమె తనకు వాగ్దానమైన జీవి కనుక, ఏదో మహోపకారం చేయాలని మనస్సులో నిశ్చయించుకున్నాడు. ఆమె దరిద్రురాలుగా ఉండకూడదను కున్నాడు.

ఎంత కాలం నుంచో, లక్షవర్తి వ్రతం చేసుకుందామని సుహాసిని పోరుతోంది. దానికి వెంటనే అంగీకరించాడు. ఆ వ్రత సందర్భంలో, తన యింటి ఎదురుగా నున్న తన స్థలాన్ని, భూదానం క్రింద వంట మనిషి పుత్రుడు, వేదపండితుడికి దానం చేశాడు. సుహాసిని చాలా సంతోషించింది. "గృహం కట్టిస్తే ఆమె ఋణం మనం తీర్చుకోగలుగుతాం. ఆమె కేవలం మన యింట్లో జీతానికే ఉన్నట్లుగా లేదు. అస్థి చర్మం మనకోసం అరగ తీస్తోంది." అన్నది సుహాసిని. తర్వాత గృహనిర్మాణం కూడా పూర్తి అయింది. ఆ యింట్లో, వారిని ప్రవేశపెట్టాడు.

సుహాసిని కడసారి తమ్ముడికి ఒక కూతురు ఉంది. వారు పేదవారే! తన కూతురును వంటమనిషి కొడుకు, వేద పండితుడు కనుక ఇవ్వదలచాననీ, కట్నం ఇవ్వలేననీ, సంబంధం కుదర్చమనీ, అక్కగారిని ప్రాధేయ పడ్డాడు సుహాసిని, భర్త చెవిని వేసింది.

"మనం దానం చేశాము కనుక, మనం చెప్పినట్లు ఆమె వినాలనే అహంకారం పనికిరాదు. అప్పుడు దానం ఫలితం ఉండదు. నీవు నేర్పుగా ఆ పిల్లను, ఆమెక్కు చూపి, నచ్చినట్లయితే, తర్వాత కార్యక్రమం సంగతి ఆలోచించవచ్చును" అన్నాడు అచ్యుతం. ఏదో మిష మీద పిల్లను రప్పించి, ఆమెకు చూపి, పిల్ల బాగుందా-అని, అడిగి, నీ కొడుకుకు చేసుకుంటావా? అని, అడిగింది, పిల్ల బాగుందన్న తర్వాత.

"అంతా, బాబు గారి ఇష్టం! మీ యింట్లోనే నా జీవితం చాలాభాగం గడచింది. మీరేనన్ను కనిపెట్టారు. ఒక యిల్లు ఇచ్చారు. వారు, నా కొడుకును ఒక ఇంటివాణ్ని చేస్తానంటే, నాకు అంతకంటె, కావలసినదేమున్నది? కాని, మీ బంధువులకే, ఒక వంట మనిషి కొడుక్కు పిల్ల నివ్వడం, అవమానకరంగా ఉంటుందేమో!" అన్నది, వంటమనిషి.

"అమ్మా! నీవు వంటమనిషి వయినా, వంట మనిషిగా మాత్రమే మాయింట్లో లేవు. గౌరవంగానే మసలావు. వారికిష్టమే!" అన్నది సుహాసిని.

అచ్యుతం, సుహాసిని, పెళ్ళి పీటల మీద కూర్చొని, వేద పండితుడి వివాహం జరిపించారు. వంట మనిషి సంతోషానికి అంతులేదు. అచ్యుతానికి తప్ప, వంటమనిషికి కాని, సుహాసినికి గాని, నిశ్చయతాంబూలం తర్వాత అచ్యుతం తిరస్కరింప బడిన వరుడని తెలియదు. □